
సాక్షి
గుంటూరు
శనివారం । 17 । ఫిబ్రవరి । 2024



నృసింహస్వామి సేవలో...
మంగళగిరి : పట్టణంలో వేంచేసి ఉన్న లక్ష్మీ నృసింహస్వామిని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్ సత్యనారాయణ శుక్రవారం దర్శించుకున్నారు.



స్వామివారి నగరోత్సవం
బాపట్లఅర్బన్: శ్రీమత్ సుందరవల్లి రాజ్య లక్ష్మి సమేత క్షీర భవన్నారాయణస్వామి సూర్యప్రభ వాహనంపై భక్తులకు శుక్రవారం దర్శనమిచ్చారు.



సాగర్ నీటిమట్టం
విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 517.30 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ పర్చూరు సమన్వయకర్తగా యడం బాలాజీ



సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన యడం బాలాజీ

సాక్షి ప్రతినిధి, బాపట్ల : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పర్చూరు నియోజకవర్గం సమన్వయకర్తగా యడం బాలాజీని నియమించారు. పార్టీ అధ్యక్షులు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగింది. ఈమేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. చీరాల పట్టణానికి చెందిన యడం బాలాజీ వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉన్నారు. చీరాల నియోజకవర్గం నుంచి సమన్వయకర్తగా పనిచేశారు. పార్టీ అభివృద్ధికి కృషి చేశారు. బాలాజీని పర్చూరు సమన్వయకర్తగా నియమించారు. శుక్రవారం సాయంత్రం బాలాజీ తన అనుచరులతో కలిసి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు.

వైఎస్సార్‌సీపీలో పలువురికి పదవులు

పట్నంబజారు(గుంటూరుఈస్ట్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు జిల్లాకు సంబంధించి పలువురిని పలు పదవుల్లో నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి. ఈమేరకు శుక్రవారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. రాష్ట్ర లీగల్ విభాగం అధికార ప్రతినిధిగా సయ్యద్ బాబు షేక్, ప్రధాన కార్యదర్శిగా పోలూరి వెంకటరెడ్డి, కార్యదర్శిగా కర్రి అబ్రహం లింకన్, సహాయ కార్యదర్శిగా జె.ఎలిజిబెత్‌రాణిలను నియమించారు. రాష్ట్ర ఎస్టీ విభాగం అధికార ప్రతినిధిగా వై.వెంకటసుబ్బయ్య, కార్యదర్శిగా కట్టా బుల్లయ్య, సహాయ కార్యదర్శిగా ఐ.గాంధీనాయక్‌లను నియమిస్తూ ఆదేశాలు వెలువరించారు. పార్టీ సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా మెట్టు వెంకటప్పారెడ్డి, కార్యదర్శులుగా బుసి సుబ్బారావు, ఆనం నరేంద్రరెడ్డిలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

సీఆర్డీఏ పరిధిలో రూ.83.75 కోట్లతో వసతులు

అదనపు కమిషనర్ కట్టా సింహాచలం



మంగళగిరి: సీఆర్డీఏ పరిధిలోని పలు గ్రామాల్లో రూ.83.75 కోట్లతో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు అదనపు కమిషనర్ కట్టా సింహాచలం తెలిపారు. రాజధాని పరిధిలోని వెంకటపాలెం, నవులూరు నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలు, ఈ-హెల్త్ సెంటర్‌లు, పాఠశాలలను శుక్రవారం ఆయన పరిశీలించారు. అదనపు కమిషనర్ మాట్లాడుతూ రాజధాని ప్రాంతంలో 14 ప్రభుత్వ పాఠశాలలు, 17 అంగన్‌వాడీ కేంద్రాలు, 16 ఈ-హెల్త్ సెంటర్లతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించే విధంగా శ్మశానవాటికల నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. సీఆర్డీఏ పరిధిలోని పనులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఫ్రెంచ్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయని తెలిపారు. మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగంగా కొనసాగుతున్న నిర్మాణాలను వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తిచేసి, ప్రజలకు అందుబాటులోకి తేవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్ఈ పీఎల్ఎస్ కార్తీక్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యార్డులో 1,19,963 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 1,05,771 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,19,963 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.20,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 21,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 80,343 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను తెలిపారు.

నిర్విఘ్నంగా విధ్యుక్తధర్మం

వలంటీర్లు అంటే అంత అలుసా
- కుర్చీలతో ఎందుకు కొడతారు
- సేవ చేస్తున్నందుకా.
  పెన్షన్లు పంపిణీ చేస్తున్నందుకా
- చంద్రబాబు వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వలంటీర్లు
- వలంటీర్లను సీఎం వైఎస్ జగన్ ప్రోత్సహిస్తున్నారంటూ ప్రశంసలు



పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్(ఫైల్)

మంగళగిరి: పేదలకు సేవ చేస్తున్న వలంటీర్లు అంటే చంద్రబాబుకు అంత అలుసా అని వలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వలంటీర్లు చేస్తున్న సేవలను గుర్తించి వారిని మరింత ప్రోత్సహించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్లుకు వందనం పేరుతో నగదు బహుమతులు అందజేస్తున్నారు. గురువారం జిల్లాలోని ఫిరంగిపురంలో సభ ఏర్పాటు చేసి వలంటీర్లకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్లకు ప్రోత్సహకాలు అందజేసి రానున్న ఎన్నికలలో సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. వలంటీర్లు షర్టులు మడిస్తే తాము కుర్చీలు ఎత్తుతామంటూ చంద్రబాబు వ్యాఖ్యానించారు. చంద్రబాబు వ్యాఖ్యలపై వలంటీర్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటికి వెళ్లి పెన్షన్‌లు అందజేయడం, ప్రభుత్వ పథకాలను ప్రతి ఇంటికి చేరవేయడమే తాము చేసిన తప్పా అని ప్రశ్నిస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వ పాలనలో జన్మభూమి కమిటీలు ప్రతి పనికి ప్రజల నుంచి లంచాలు తీసుకుని అవినీతిమయం చేశారు. వారి అభిప్రాయాలు వారి మాటలలోనే..

ఎందుకు కొడతారో చెప్పాలి?



సంక్షేమ పథకాలు ఇంటి వద్దనే అందుతుండడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ పాలనలో వృద్ధులు పెన్షన్ తీసుకోవాలంటే కార్యాలయాల చుట్టూ తిరిగి ఇబ్బంది పడేవారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. ప్రజలకు సేవలు అందిస్తున్నందుకు కుర్చీలు ఎత్తి వలంటీర్లను కొట్టాలా.. ప్రజలకు సేవలు అందిస్తున్నందుకు కొడతారో చంద్రబాబు సమాధానం చెప్పాలి.

దిడ్ల క్రాంతి రణదేవ్, సేవా రత్న పురస్కార గ్రహీత, మార్కండేయకాలనీ

చంద్రబాబుకు బుద్ధి చెబుతారు



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్లను పురస్కారాలు, నగదు అందజేసి మరింత ప్రోత్సహిస్తున్నారు. జీతాలతో సంబంధం లేకుండా ప్రజలకు సేవ చేస్తున్నందుకు ఎంతో ఆనందగా వుంది. చంద్రబాబు నాయుడు వలంటీర్లను అవమానించడం మానుకోవాలి. లేకపోతే ప్రజలే చంద్రబాబుకు బుద్ధి చెబుతారు.

విన్నకోట నాగేశ్వరరావు, సేవా వజ్ర పురస్కార గ్రహీత

ప్రోత్సహిస్తే తప్పేంటి?



పేదలకు పథకాలు అందజేయడం, వృద్ధులకు, దివ్యాంగులకు తాము అందిస్తున్న సేవలను గుర్తించి సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తమను ప్రోత్సహించేందుకు పురస్కారాలు అందజేశారు. వలంటీర్లపై చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ఇప్పటికే పలుసార్లు విమర్శలు చేశారు. తాము చేస్తున్న సేవలకుగాను ప్రభుత్వం ప్రోత్సహిస్తే తప్పేంటి.

లక్ష్మి, సేవా వజ్ర పురస్కార గ్రహీత, నిడమర్రు

జీతాల కోసం పనిచేయడం లేదు.



వలంటీర్లు జీతాల కోసం పని చేయడం లేదు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయ సాధన కోసం ప్రజలకు పథకాలను అందజేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు. వలంటీర్లు పట్ల మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యలు సరికాదు. గతంలో జన్మభూమి కమిటీల లాగా తాము పథకాల అమలు చేసేందుకు లంచాలు తీసుకుని అవినీతికి పాల్పడడం లేదని గుర్తించుకోవాలి.

యామిని, సేవా రత్న పురస్కార గ్రహీత, నిడమర్రు

అన్ని శాఖల సమన్వయంతో
క్వారీ తిరునాళ్ల

- తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖర్ జైన్
- క్వారీ తిరునాళ్లపై సమావేశం

తెనాలి: అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, తిరునాళ్ల ప్రశాంతంగా జరిగేలా చూడాలి, ఏ ఒక్క అవాంఛనీయ సంఘటనకు ఆస్కారం లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సబ్‌కలెక్టర్ ప్రఖర్ జైన్ స్పష్టంచేశారు. చేబ్రోలు మండలం వడ్లమూడి పరిధిలోని క్వారీ వద్ద గల బాలకోటేశ్వరస్వామి దేవస్థానంలో ఏటా మహాశివరాత్రికి జరిగే తిరునాళ్ల ఏర్పాట్లపై శుక్రవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వివిధ ప్రభుత్వ శాఖల కో-ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. సబ్‌కలెక్టర్ ప్రఖర్ జైన్ అధ్యక్షత వహించారు. తిరునాళ్ల ప్రాంతంలో మూడు రోజులు మద్యంపై నియంత్రణ తప్పనిసరి అని చెప్పారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరాలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. ముందుగా సబ్‌కలెక్టర్ ప్రఖర్ జైన్ వివిధ శాఖల అధికారులతో తిరునాళ్ల ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ బందోబస్తు, ఆర్టీసీ బస్సుల ఏర్పాటు, శానిటేషన్, వైద్యసౌకర్యాల ఏర్పాట్లపై సంబంధిత అధికారులు వివరాలు తెలియజేశారు. అడిషనల్ ఎస్పీ పర్యవేక్షణలో డీఎస్పీతో సహా 300 మందితో బందోబస్తు ఉంటుందని చేబ్రోలు సీఐ వై.కోటేశ్వరరావు వెల్లడించారు. వైద్య శిబిరం 24 గంటలు పనిచేస్తుందని షిఫ్టుల వారీగా ఒక వైద్యాధికారి, పారా మెడికల్ సిబ్బంది పనిచేస్తారని వైద్యశాఖ అధికారి చెప్పారు. ఏదైనా ఎమర్జన్సీ వస్తే ప్రాథమిక వైద్యం అందించి, రోగిని తెనాలి లేదా గుంటూరుకు రిఫర్ చేస్తామన్నారు. ఆర్టీసీ తెనాలి డిపో మేనేజర్ రాజశేఖర్ మాట్లాడుతూ తెనాలి డిపో నుండి 50 బస్సులు నడుపుతామని, అవసరమైతే మరిన్ని కేటాయిస్తామని చెప్పారు. దేవస్థానంలో చలువ పందిళ్లు, క్యూలైన్లు, పొంగళ్ల షెడ్డు ఏర్పాట్లపై దేవస్థానం కార్యనిర్వహణాధికారి పి.రామకోటేశ్వరరావు తెలియజేశారు. శానిటేషన్, లైటింగ్, మంచినీరు ఏర్పాట్లను చేబ్రోలు పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ వివరించారు. వడ్లమూడి నుంచి దాణాఫ్యాక్టరీ మీదుగా ఆలయానికి వచ్చే రోడ్డు మరమ్మతుల ఆవశ్యకతను వడ్లమూడి సర్పంచ్ ఎం.అనితారాణి వెల్లడించగా, పరిశీలిస్తానని సబ్‌కలెక్టర్ చెప్పారు. చేబ్రోలు ఎంపీడీవో రమాదేవి, డివిజనల్ పంచాయతీ అధికారి జి.స్వరూపరాణి, ఈవోపీఆర్డీ జి.శ్రీనివాసరావు, మోటారు వాహనాల అధికారి మధుసూదనరావు పాల్గొన్నారు.



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ ప్రఖర్ జైన్

వైభవంగా రథసప్తమి

సప్తవాహనాలపై దర్శనమిచ్చిన నృసింహస్వామి

మంగళగిరి: మంగళగిరిలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం ప్రత్యేక పూజల అనంతరం శ్రీదేవి భూదేవి సమేతుడైన శ్రీవారు సప్తవాహనాలపై గ్రామోత్సవంలో దర్శనమివ్వగా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉదయం సూర్యప్రభవాహనం, శేష వాహనం, గరుడ వాహనం, హనుమంత వాహనాలపై గ్రామోత్సవంలో దర్శనమిచ్చిన స్వామి వారు సాయంత్రం కల్పవృక్ష, రాజాధిరాజ, చంద్రప్రభ వాహనాలపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈవో అసిస్టెంట్ కమిషనర్ అన్నపురెడ్డి రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.



ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి

గుంటూరువెస్ట్: కల్తీ తాగునీటి వల్ల ఎవ్వరికీ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి అంశంలోనూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరితో కలిసి నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటి సర్వే నిర్వహించాలన్నారు. దీనికి ప్రత్యేక బృందాలను సిద్ధం చేశామని చెప్పారు. ఇంటింటి సర్వేలో ప్రతి అంశాన్ని అడిగి తెలుసుకోవాలన్నారు. వారు అందించే సూచనలు కూడా తీసుకోవాలని చెప్పారు. అస్వస్థతతో ఉన్న వారిని గుర్తించి తక్షణం చికిత్స అందించాలన్నారు. దీనికి సంబంధించి ప్రభుత్వ వైద్యశాలలో ప్రత్యేక ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న వారు ఆర్ఎంపీల వద్దకు వెళ్లకుండా దగ్గరలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు వెళ్లే విధంగా చూడాలన్నారు. జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ గుంటూరులో ట్యాంకర్ల ద్వారా అందించే మంచినీటిని క్లోరినేషన్ చేసి అందిస్తున్నామన్నారు. వాంతులు, విరేచనాలు జరిగిన కొన్ని ప్రాంతాల్లోని నీటి శాంపిల్స్‌ను టెస్ట్‌లకు పంపామన్నారు. ఏ అవకాశాన్ని వదలకుండా పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రజలు ఆందోళన పడవద్దని పేర్కొన్నారు. సమావేశంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్, రీజనల్ డైరెక్టర్ డాక్టర్ శోభారాణి, జిల్లా వైద్య అధికారి డాక్టర్ విజయలక్ష్మి, ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ డాక్టర్ శ్రావణ్‌బాబు, ఆర్ఎంఓ సతీష్ అధికారులు పాల్గొన్నారు.

నిర్దేశించిన సమయంలోనే ఓటరు అర్జీలు పరిష్కరిస్తున్నాం

గత నెల 22న ఓటరు తుది జాబితా వచ్చిన తరువాత ఇప్పటివరకు అందిన అర్జీలను ఎలక్షన్ కమిషన్ మార్గనిర్దేశకాలను అనుసరిస్తూ క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి తెలిపారు. శుక్రవారం రాత్రి రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ముఖేష్ కుమార్ మీనా నిర్వహించిన వీడియో సమావేశానికి స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు, జాయింట్ కలెక్టర్ రాజకుమారి, జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖర్ జైన్, ట్రైనీ ఎస్పీ మనోజ్ హెగ్డే, డీఆర్వో పెద్ది రోజా పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితాకు సంబంధించి ఫారం 6, 7, 8 పెండింగ్ లేకుండా క్షేత్రస్థాయిలో ఈఆర్వోలు సక్రమంగా పరిష్కరించేలా పర్యవేక్షిస్తున్నామన్నారు. ఇప్పటికే ప్రింటింగ్ అయి వచ్చిన ఎపిక్ కార్డులను పోస్టల్ శాఖ ద్వారా ఎప్పటికప్పుడు సంబంధిత వ్యక్తులకు పంపిణీ చేస్తున్నామన్నారు. ఉద్యోగి వివరాలను నిర్దేశించిన ఫార్మేట్‌లో నమోదు చేయడం జరుగుతోందన్నారు. పోలింగ్ కేంద్రంలో మౌలిక సదుపాయాలకు కావాల్సిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ మాట్లాడుతూ జిల్లాలో జాతీయ, రాష్ట్ర, పంచాయతీ రహదారులపై 11 ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో 368 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామన్నారు. 2019 ఎన్నికల సమయంలో నమోదు చేసిన కేసు వివరాలు సేకరించి ప్రమాదకర వ్యక్తులపై బైండోవర్ కేసులు కూడా నమోదు చేస్తున్నామన్నారు.

నేను అందరివాడిని..

- అందరికి అందుబాటులో ఉంటా..
- ప్రజల దీవెనల కోసం వస్తా..
- నరసరావుపేట లోక్‌సభ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ అనిల్‌కుమార్‌యాదవ్
- పల్నాడు రోడ్డులో నూతన ఎంపీ కార్యాలయం ప్రారంభం
- సీఎం ఆశీస్సులు...పథకాల అమలుతో గెలుపు ఖాయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, డాక్టర్ అనిల్

నరసరావుపేట: నేను అందరివాడిని, అందరికి అందుబాటులో ఉంటానని నరసరావుపేట లోక్‌సభ నియోజకవర్గ సమన్వయకర్త, నెల్లూరు టౌన్ ఎమ్మెల్యే డాక్టర్ పి.అనీల్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం పల్నాడు రోడ్డులో ఏర్పాటుచేసిన లోక్‌సభ నియోజకవర్గ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డితో కలిసి కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. తనను ఒక మంచి ప్రాంతానికి పంపించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గంలోని మంత్రి అంబటి రాంబాబు, ఆరుగురు శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు, నంబూరు శంకరరావు, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, కాసు మహేష్‌రెడ్డి, చిలకలూరిపేట సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు, ప్రజలు అందరూ కలిసికట్టుగా పెద్దఎత్తున తనకు స్వాగతం పలికి ఆశీస్సులు అందించి విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యేలు అందరితో తనకు పదేళ్లుగా పరిచయం ఉందన్నారు.
అందరూ తనకు పెద్దలేనన్నారు. వారందరినీ కలుపుకొని పోతామని, సీఎం జగన్ ఆశీస్సులు, ఆయన అమలుచేస్తున్న పథకాలతో గెలుస్తామనే నమ్మకం తమకు ఉందన్నారు. తమకు కేవలం రెండు నెలల సమయం మాత్రమే ఉందన్నారు. అవకాశం ఉన్నంతవరకు ప్రతి గ్రామంలో ఎక్కువ మందిని కలిసేందుకు పర్యటిస్తామన్నారు. తనకు ఆశీస్సులు, దీవెనలు ఇవ్వాలని ప్రజలను కోరారు. నిజాయతీ అనేది చాలా ముఖ్యమని, అది తమ నాయకుడితోపాటు తామందరికీ ఉందన్నారు. ప్రజలు తమకు ఓట్లు వేస్తున్నారంటే అది సీఎం జగన్‌ను చూసి మాత్రమేనన్నారు. వారందరినీ గౌరవించాల్సిన బాధ్యత తమకు ఉందన్నారు. ఆయనను విడిచిపెట్టే పని ఎప్పుడూ చేయనని, ఆయన విధేయుడిగా ఉంటానని స్పష్టం చేశారు. నెల్లూరు జిల్లా నుంచి ఒక నమ్మకంతో ఈ ప్రాంతానికి మీ బిడ్డగా వచ్చిన తనకు ఆశీస్సులు ఇవ్వాలని కోరారు. త్వరలో ప్రతి నియోజకవర్గంలో తిరిగేందుకు స్థానిక ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలతో ఒక ప్లాన్ ఆఫ్ యాక్షన్ రూపొందించి పర్యటిస్తామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ అనిల్ అన్న రాక క్యాడర్‌లో నూతన ఉత్తేజాన్ని నింపిందన్నారు. ఆరంభం అదిరిందని, సుమారు 25 నుంచి 30వేల మంది ప్రజలు హాజరై స్వాగతం పలికారన్నారు. ఇదే ఉత్సాహంతో వచ్చే ఎన్నికల్లో ఏడుకు ఏడు నియోజకవర్గాలు, ఎంపీ స్థానం విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

'పులిచింతల' రోడ్డుకు నిధులు

అచ్చంపేట: మాదిపాడు నుంచి రెండు గిరిజన తండాలను కలుపుతూ పులిచింతల ప్రాజెక్టు ఘాట్‌రోడ్డు వరకు అంటే ఆరు కిలోమీటర్ల మేర రోడ్డు వేసేందుకు రూ.3.50 కోట్లు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు మంజూరు చేస్తూ పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ ప్రాంత ప్రజల కష్టాలను చూసి చలించిన ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రోసూరు వచ్చిన సందర్భంలో సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లిన విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవ, ఎమ్మెల్యే శంకరరావు కృషి ఫలితంగా జిల్లా కలెక్టరు మంజూరు చేసిన రోడ్డు రెండు గిరిజన తండాల ప్రజలకే కాకుండా పులిచింతల ప్రాజెక్టు సందర్శనకు వెళ్లే వేలమందికి ఊరటనిచ్చే విషయం. ఈ ప్రాంతానికి నాలుగు సార్లు ప్రాతినిధ్యం వహించిన మంత్రి కన్నా లక్ష్మీనారాయణ, పదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్న కొమ్మాలపాటి శ్రీధర్ సాధించలేని ఈ ఘనతను ప్రస్తుత ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సాధించడంపై స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుత యుగంలో తులనాత్మక చట్టం ప్రముఖ పాత్ర

- సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రవీంద్ర భట్
- వీఐటీ– ఏపీ వర్సిటీలో కంపేరిటివ్ లా పై అంతర్జాతీయ సదస్సు



మాట్లాడుతున్న జస్టిస్ రవీంద్ర భట్

ఐనవోలు(తాడికొండ): ప్రస్తుత యుగంలో కంపేరిటివ్ లా (తులనాత్మక చట్టం) ప్రముఖ పాత్ర పోషిస్తోందని సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూరి జస్టిస్ రవీంద్ర భట్ అన్నారు. తుళ్లూరు మండలం ఐనవోలు వీఐటీ– ఏపీ విశ్వ విద్యాలయంలో స్కూల్ ఆఫ్ లా – బర్మింగ్ హోమ్ యూనివర్సిటీ, రామయ్య స్కూల్ ఆఫ్ లా సంయుక్త ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ కంపేరిటివ్ లా ఎక్స్ ప్లోరింగ్ కన్వర్జన్స్, డైవర్షన్, లిమినల్ స్పేసెస్ అనే అంశంపై మూడు రోజుల అంతర్జాతీయ సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ దేశాల న్యాయవ్యవస్థల మధ్య వ్యత్యాసాలు, సారూప్యతలను అధ్యయనం చేసే తులనాత్మక చట్టంపై ఆయన విద్యార్థులకు వివరించారు. వీఐటీ ఏపీ విశ్వ విద్యాలయ వీసీ డాక్టర్ కోటారెడ్డి మాట్లాడుతూ వర్సిటీ సాధిస్తున్న అనేక విజయాలను వివరించి విద్యార్థులను న్యాయ రంగంలో కూడా రాణించేందుకు అవసరమైన నైపుణ్యాలు అందిస్తున్నామని చెప్పారు. వాటిని అందిపుచ్చుకొని విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని సూచించారు.
రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి మాట్లాడుతూ తమ వర్సిటీలో అందిస్తున్న ప్రఖ్యాత ఇంజినీరింగ్ ప్రోగ్రామ్‌లతో పాటు నాన్ ఇంజినీరింగ్ కోర్సుల వివరాలు తెలియజేసి క్యాంపస్‌లో విద్యార్థులకు అందిస్తున్న మౌలిక సదుపాయాలను వివరించారు. వర్సిటీ స్కూల్ ఆఫ్ లా డీన్ డాక్టర్ బెనర్జీ చక్కా మాట్లాడుతూ మేథోపరమైన సంభాషణను పెంపొందించడం, విద్యాపరమైన మార్పిడిని పోత్సహించడం, పరిశోధన, తులనాత్మక న్యాయ పరిజ్ఞానం పెంపొందించేందుకు ఈ సదస్సు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రామయ్య కాలేజ్ ఆఫ్ లా, బెంగళూరు ప్రిన్సిపల్ ఉమా మహేష్ సత్యనారాయణ, వీఐటీ చెన్నై ప్రొఫెసర్ గాంధీ, బర్మింగ్ హోమ్ వర్సిటీ గ్లోబల్ ఎంగేజ్ మెంట్స్ ప్రొఫెసర్, డైరెక్టర్ డాక్టర్ అలెగ్జాండ్రా కావోస్కి తదితరులు ప్రసంగించారు. సదస్సులో భారతదేశం, విదేశాల్లోని ప్రసిద్ధ న్యాయ పాఠశాలల్లోని న్యాయ విద్యార్థుల నుంచి 120 కంటే ఎక్కువ పరిశోధన పత్రాలు స్వీకరించినట్లు తెలిపారు. అందులో మూడు రోజుల చర్చల్లో 80 పరిశోధన పత్రాలను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీఐటీ ఏపీ విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్లు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

విజయకీలాద్రిపై రథసప్తమి వేడుకలు


వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న త్రిదండి దేవనాథ రామానుజ జీయర్‌స్వామి


పెరుమాళ్లకు కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై శుక్రవారం రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ విజయకీలాద్రి దివ్యక్షేత్ర 7వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మరియు రథసప్తమి పురస్కరించుకుని త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి, త్రిదండి దేవనాథ రామానుజ జీయర్‌స్వామి పరిపూర్ణ మంగళా శాసనములతో ప్రత్యక్ష పర్యవేక్షలో ఉదయం సామూహిక ఆదిత్య హృదయస్తోత్ర పారాయణ నిర్వహించినట్లు చెప్పారు. అనంతరం విజయకీలాద్రి ఆలయ పెరుమాళ్ల అందరికీ అంగరంగ వైభవంగా కల్యాణ మహోత్సవం గావించామని తెలిపారు. కలియుగ ప్రత్యక్ష దైవం, విజయకీలాద్రి వాసుడైనవెంకటేశ్వరస్వామి వారిని సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారని వివరించారు. సాయంత్రం వెంకటేశ్వరస్వామి వారు గరుడ వాహనంపై విజయకీలాద్రి గిరి పరిక్రమణ జరిగిందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారని పురాణం వెంకటాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వేద విద్యార్థులు, విజయకీలాద్రి దివ్యక్షేత్ర అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మిషీన్ లెర్నింగ్ టెక్నాలజీ పుస్తకావిష్కరణ



తాడేపల్లిరూరల్: ప్రపంచ వ్యాప్తంగా పరిశోధన సంస్థలు, విశ్వవిద్యాలయంలోని పరిశోధకుల పరిశోధన పత్రాలను సేకరించి 8 అధ్యాయాలతో కూడిన పుస్తకాన్ని శుక్రవారం వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ ప్రో చాన్సలర్ డాక్టర్ కేఎస్ జగన్నాథరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని పలు యూనివర్సిటీలకు చెందిన పరిశోధన అధ్యాపకులతో పాటు చైనా, పెరు, దక్షిణ కొరియా, వియత్నాం వంటి దేశాల్లోని ఆయా విశ్వవిద్యాలయాల్లో ఉన్న పరిశోధకులు మెషీన్ లెర్నింగ్ టెక్నాలజీపై విస్తృత స్థాయిలో పరిశోధనలు చేశారని తెలిపారు. ఆయా పరిశోధన పత్రాలు ఒక చోటుకు చేర్చి పుస్తక రూపంలో రూపొందించినట్లు వివరించారు. ఇందుకు కేఎల్‌యూలోని సీఎస్ఈ అధ్యాపకులు డాక్టర్ కొల్లా భానుప్రకాష్, వియత్నాంకు చెందిన టెన్ అన్ ట్రాన్, సింగపూర్‌కు చెందిన యువాన్ సీకే టాన్, ఇండియాకు చెందిన సుబ్రతా చౌదరీ ఎడిటర్‌లుగా వ్యవహరించినట్లు తెలిపారు. డాక్టర్ కొల్లా భానుప్రకాష్ మాట్లాడుతూ 8 అధ్యాయాలు, 158 పేజీలు కలిగిన ఈ పుస్తకాన్ని రూపొందించడానికి తమకు 9 నెలల సమయం పట్టిందన్నారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ కె.సుబ్బారావు పాల్గొన్నారు.

జీజీహెచ్ నుంచి 36 మంది డిశ్చార్జి


గుంటూరు మెడికల్: వాంతులు, విరోచనాలతో గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వారి ఆరోగ్యం కుదుటపడడంతో శుక్రవారం 36 మందిని ఇంటికి పంపించామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు. చికిత్స కోసం వచ్చేవారి సంఖ్య బాగా తగ్గుముఖం పట్టిందని పేర్కొన్నారు. శుక్రవారం కేవలం నలుగురు మాత్రమే చికిత్స కోసం వచ్చారని, చికిత్స పొందుతున్న రోగుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వివరించారు.

ఇంటింటికి ఆరోగ్య సర్వే

డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: అతిసార నియంత్రణలో భాగంగా రౌండ్ ది క్లాక్ ప్రాతిపదికన నిరంతర వైద్య సేవల్లో భాగంగా ఏడు వైద్య శిబిరాలు కొనసాగిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శారదా కాలనీలో మూడు, ఇందిరా ప్రియదర్శి కాలనీలో రెండు, లాంచెస్టర్ రోడ్డు పరిధిలో రెండు వైద్య శిబిరాల్లో ప్రజలకు ఆరోగ్య సేవలు అందించినట్లు తెలిపారు. 35 వైద్య బృందాలతో ఇంటింటా సర్వే నిర్వహించారన్నారు. సర్వేలో 11,410 గృహాలు సందర్శించి, 3,434 ఓఆర్ఎస్ ప్యాకెట్లు, 56 జింక్ మాత్రలు పంపిణీ చేసినటులవివరించారు. వ్యాధికి కారణాలు, లక్షణాలు, చికిత్స, నివారణపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. అవగాహన కరపత్రాలు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. సర్వేలో 12 మంది అనుమానిత అతిసార బాధితులను గుర్తించి, అందులో నలుగురికి గురికి ఇంటి వద్దనే చికిత్స అందించినట్లు వెల్లడించారు. మిగిలిన 8 మందిలో నలుగురికి ఐపీడీ కాలనీలోని పట్టణ ఆరోగ్యకేంద్రంలో, ఇద్దరికి శారదా కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రంలో, ఇద్దరికి లాంచేస్టర్ రోడ్ పట్టణ ఆరోగ్యకేంద్రంలో చికిత్స అందించినట్లు తెలిపారు. ఈసందర్భంగా ప్రజలు కాచి చల్లార్చిన నీరు తాగాలని, తాజా ఆహార పదార్థాలు మాత్రమే భుజించాలని, నిల్వ ఉండి, చెడిపోయిన, కుళ్లిన ఆహార పదార్థాలు, పండ్లు తీసుకోరాదన్నారు. ఇంటింటా సర్వే చేసినప్పుడు ప్రజలను ఈవిషయాలపై చైతన్య పరచడం జరిగిందన్నారు. అవసరమైన వారు ఇంటి వద్ద లభించే ద్రవపదార్థాలు, ఓఆర్ఎస్ ద్రావణం, జింక్ మాత్రలు ఆరోగ్య సిబ్బంది సలహా మేరకు వినియోగించాలని సూచించారు. ఆయా కార్యక్రమాలను ప్రోగ్రాం అధికారులు, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి పర్యవేక్షించారని కోరారు. వైద్య సహాయం కావాల్సిన వారు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నంబర్లుకు ఫోన్ చేసి 8341396104, 7207595104 సహాయం పొందాలని డాక్టర్ విజయలక్ష్మి సూచించారు.


రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



జానీబాషా మృతదేహం

మేడికొండూరు: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని పేరేచర్ల ఆరో మైలు సమీపంలోని పెట్రోలు బంకు వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. ఘటనపై మేడికొండూరు సీఐ జయకుమార్ తెలిపిన వివరాలు.. సత్తెనపల్లి మండలం గుడిపూడికి చెందిన షేక్ జానిబాషా(32) స్నేహితుడి కారు తీసుకుని గుడిపూడి నుంచి గుంటూరు వెళుతున్న సమయంలో మార్గమధ్యలో పేరేచర్ల పెట్రోలు బంకు వద్ద కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. గుంటూరు మిర్చి యార్డు నుంచి అచ్చంపేట వెళుతున్న లారీని ఢీకొని పక్కనే ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది. ప్రమాదంలో జానీ బాషా ఘటనా స్థలంలోనే మృతి చెందగా, కారు నడుపుతున్న సులేమాన్ గాయపడ్డాడు. క్షతగాత్రుడిని పోలీసులు 108లో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మన శరీరంలో పేరుకుపోయే వ్యర్థాలను ఎప్పటికప్పుడు బయటకు పంపించేందుకు కిడ్నీలు ఎప్పుడూ శ్రమిస్తూనే ఉంటాయి. అందుకుగాను మనం తగినంత నీటిని తాగడంతోపాటు కిడ్నీలను సురక్షితంగా ఉంచే ఆహారాలను తీసుకోవాలి. అయితే కొందరిలో పలు కారణాల వల్ల కిడ్నీ సమస్యలు వస్తుంటాయి. ఈ క్రమంలోనే వారిలో కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. అవేమిటో తెలుసుకుంటే ముందే జాగ్రత్త పడవచ్చు. ఆ లక్షణాలేమిటో తెలుసుకుందాం.



మీ కిడ్నీలు కుశలమేనా?

తరచూ మూత్రానికి వెళ్లాల్సి వస్తే దాన్ని కిడ్నీ సమస్యగా అనుమానించాలి. అయితే డయాబెటిస్ ఉన్నవారిలో సహజంగానే ఇలా జరుగుతుంది. కనుక ఆ వ్యాధి ఉందో, లేదో చెక్ చేయించుకోవాలి. ఒకవేళ డయాబెటిస్ లేకపోయినా మాటిమాటికీ మూత్రానికి వెళ్లాల్సి వస్తుందంటే.. దాన్ని కిడ్నీ సమస్యగా అనుమానించాలి.

● కిడ్నీ సమస్యలు ఉన్నవారిలో ముఖం అంతా వాపులకు గురై ఉబ్బిపోయి కనిపిస్తుంది. కాలి మడమలు, కాళ్లు, పాదాలు, చేతులు ఉబ్బిపోయి కనిపిస్తాయి ● కిడ్నీ సమస్యలు ఉంటే తీవ్రమైన అలసట వస్తుంది. కొందరిలో రక్తహీనత సమస్య కూడా ఏర్పడుతుంది ● చర్మం పొడిగా మారి దురదలు పెడుతుంది ● నోటి దుర్వాసన ఉంటుంది ● కిడ్నీ సమస్యలు ఉంటే కొందరిలో జ్ఞాపకశక్తి తగ్గుతుంది. కొందరికి తల తిరిగినట్లు అనిపిస్తుంది ● కిడ్నీ సమస్యలు ఉన్నవారిలో వెన్ను నొప్పి వస్తుంటుంది ● వాంతి వచ్చినట్లుగా... వికారంగా అనిపిస్తుంది ● కిడ్నీ సమస్యలు ఉంటే శ్వాస తీసుకోవడం కష్టంగా మారుతుంది ● కిడ్నీ సమస్యలు ఉన్నవారు వేడి వాతావరణంలో ఉన్నప్పటికీ చలిగా అనిపిస్తుంది. కొందరు వణుకుతారు.

టపైన తెలిపిన లక్షణాలు కనుక ఎవరిలో అయినా ఉంటే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యుని సంప్రదించి వారి సలహా మేరకు సంబంధిత పరీక్షలు చేయించుకోవాలి. అవసరం అయితే మందులను వాడాల్సి ఉంటుంది. దీంతో పాటు కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచే ఆహారాలను తినాలి. ఇలా చేయడం వల్ల కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.

వెడ్డింగ్ ప్లాన్

సింపుల్‌గా... సూపర్‌గా..!

ఇల్లు కట్టి చూడు.. పెళ్లి చేసి చూడు అన్నారు పెద్దలు. అంటే మన సమాజంలో ఈ రెండు విషయాలూ ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్న విషయాలన్నమాట. ఎందుకంటే ఒకవైపు ఖర్చు ఎంత పెట్టినా ఇంకా పెట్టాలేమో అన్నట్లుగా ఉంటుంది. ఎక్కడ పెంచాలో.. ఎక్కడ తగ్గించుకోవాలో అర్థం కాదు.. సరైన ప్లానింగ్ లేకపోతే అంతా గందరగోళమే. చివరికి తడిసి మోపడమవడం ఖాయం. తీరా అంత ఖర్చు పెట్టాక మనసుకు సంతృప్తి లేకపోతే మరింత ఇబ్బందికరంగా ఉంటుంది. అందుకే పెళ్లి విషయంలో ముందస్తు ప్రణాళిక అవసరం.



భారతీయ సంప్రదాయంలో పెళ్లికి ఎంతో ప్రాధాన్యత ఇస్తారు. కన్యాదాత ఎంతో హంగు, ఆర్భాటాలతో పెళ్లి చేస్తాడు. ఒకోసారి వరుడి తరఫు వారే పెళ్లి ఖర్చులు పెట్టుకోవడం, లేదా ఖర్చును ఇద్దరూ కలిసి పంచుకోవడం... ఏ రకంగా చూసినా సరే, జీవితంలో ఒక్కసారే జరిగే సంబరం కావడంతో ఖర్చుకు ఎక్కడా వెనుకాడరు. పెళ్లి శుభలేఖ దగ్గర నుంచి.. మండపాలంకరణ వరకు, పెళ్లిబట్టల నుంచి నగల వరకు; టిఫిన్ల దగ్గర నుంచి విందు భోజనాల వరకు... ఇలా ప్రతిదీ ఖర్చుతో కూడుకున్నదే. భారతీయులు సగటున పెళ్లికోసం చేస్తున్న ఖర్చు రూ. 5 లక్షల నుంచి రూ. కోటికి పైగా ఉంటుందన్నది ఒక అంచనా.



ఇల్లలకగానే పండగా... అన్నట్లు ఉన్నదంతా వదిలించుకుని లేదా లేకపోతే అప్పులు చేసి మరీ పెళ్లి చేసిన తర్వాత ఆ జంట కాపురం కోసం మరి కొంత ఖర్చు చేయాల్సి వస్తుంది. ఏది తక్కువైనా నవ్వుల పాలు కావడం ఖాయం. అయితే వైభవంగా పెళ్లి చేయడం వరకు తప్పేం లేదు కానీ స్తోమతకు మించి అప్పులు చేయడంలోనే అభ్యంతరం... తప్పనిసరి వాటికి ఎలాగూ ఖర్చు తప్పదు కానీ కాస్త ఆచి తూచి ప్లాన్ ప్రకారం చేస్తే పెళ్లికి అయ్యే వృథా ఖర్చును కొంత తగ్గించవచ్చు. అదెలాగో చూద్దాం...



ముందస్తు ప్రణాళిక ...

పెళ్లి ఎంత గ్రాండ్ గా చేశాం అనే దానికన్నా ఎంత ప్రణాళికాబద్ధంగా ఆర్గనైజ్ చేశామన్నది ముఖ్యం. అనుకున్న బడ్జెట్ లోపు చేయాలంటే ఖర్చు ఎక్కడ పెట్టాలి.. ఎక్కడ తగ్గించుకోవాలో ముందుగానే నిర్ణయించుకోవాలి. ఇందుకోసం పెళ్లి తంతులో వివిధ ఘట్టాలకు అవసరమైన వస్తు సామగ్రిని ముందుగానే జాబితా రాసుకోవాలి. అవసరమైతే మండపం, అలంకరణ, కేటరింగ్ వంటి వాటిని ఒకరికే కాంట్రాక్ట్ ఇస్తే కొంతమేరకు ఖర్చు తగ్గే అవకాశం ఉంటుంది. అలాగే పర్యవేక్షణ కూడా బావుంటుంది. వస్త్రాలు, నగలు కూడా అవసరం మేరకే కొనుగోలు చేయాలి.

అతిథుల జాబితా అన్నింటికన్నా ముఖ్యం...

పెళ్లి అంటేనే సకుటుంబ సపరివారంతోపాటు బంధు మిత్రులు, శ్రేయోభిలాషులు అంతా హాజరు కావాలని అందరూ కోరుకుంటారు. అందుకోసం బంధువులకు ఒకటని, మిత్రులకు మరొకటని కార్డులు ప్రింట్ చేయిస్తుంటారు. ఇక్కడ కూడా ఖర్చు తగ్గించుకునే అవకాశం ఉంటుంది. అందరికీ కామన్‌గా ఒకే ఆహ్వాన పత్రిక ఉంటే ఖర్చు తగ్గుతుంది. సేహితులకు కార్డులు కొట్టించే బదులు ఈ ఇన్విటేషన్ల ద్వారా కూడా ఆహ్వానం పంపుకోవచ్చు. అలాగే పెళ్లిలో మెహందీ అని, సంగీత్ అని, హల్దీ అనీ, రిసెప్షన్ అనీ ఇలా చాలా రకాల ఈవెంట్స్ చేస్తున్నారు. పెళ్లికూతురు దగ్గర కొన్ని, పెళ్లి కొడుకు వద్ద మరికొన్ని.. ఇద్దరిని కలిపి కొన్ని ఈవెంట్స్ ప్లాన్ చేస్తున్నారు. వీటికి ఎవరెవరిని పిలవాలనే దానిపై కూడా కసరత్తు చేయాలి. అప్పుడు ఏ ఈవెంట్ కు ఎంతమంది వసారో అవగాహన ఉంటుంది కాబట్టి.. అందుకనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలి.

ముందుగా బడ్జెట్ వేసుకోండి... పెళ్లికి ముందు బడ్జెట్ సిద్ధం చేసుకోవాలి. బడ్జెట్ లేకుండా వెడ్డింగ్ ఫంక్షన్ నిర్వహిస్తే ఖర్చులు భారీగా ఉంటాయి. మీ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని బడ్జెట్ సిద్ధం చేసుకోవడం మొదటి పని. వివాహం అలా చేసుకోవాలని ఇలా చేసుకోవాలని చాలా కోరికలు ఉంటాయి. కానీ అవసరమైన వాటిని మాత్రమే కొనుగోలు చేయాలని గుర్తుంచుకోండి. ఉదాహరణకు వివాహానికి బట్టలు, ఆభరణాలు అవసరం. అలాగని ఖరీదైన బట్టలు, ఆభరణాలు అవసరం లేదు. బడ్జెట్‌లో వచ్చే వాటిని తీసుకోవడం ఉత్తమం.

క్యాటరింగ్: పెళ్లి విందులకు డబ్బు గుడ్డిగా ఖర్చు చేస్తారు. చాలా పెళ్లిళ్లలో ఆహారం వృథా అవడం గమనిస్తూనే ఉంటాం. వివాహ విందు మెనులో అవసరమైన ఆహార పదార్థాలను మాత్రమే చేర్చండి. లేనిపోని గొప్పల కోసం మెనూని పెంచవద్దు. హాజరయ్యే అతిథుల సంఖ్యకు అనుగుణంగా క్యాటరింగ్ సిద్ధం చేసుకోవాలి.



అలంకరణ సామగ్రి

పెళ్లి ఇంట్లో చాలా అలంకరణ ఉంటుంది. అవసరమైన అలంకరణ వస్తువులు మాత్రమే తీసుకోవాలి. వీటిలో పువ్వులు చాలా ముఖ్యమైనవి. వాటిని చౌకగా ఉన్న ప్రదేశాల నుంచి కొనుగోలు చేస్తే కొంత డబ్బు ఆదా అవుతుంది.



హనీమూన్ ట్రిప్... పెళ్లితంతు ముగిసిన తర్వాత నూతన వధూవరుల హనీమూన్ కోసం లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. హనీమూన్ డెస్టినేషన్లుగా పేరుగాంచిన దేశాలకు ఎగిరిపోతున్నారు. ఇది కూడా బడ్జెట్ పెరగడానికి కారణం అవుతుంది. దీని బదులుగా మన దేశంలోనే అనువైన ప్రాంతాలను ఎంచుకుంటే చాలా సమయంతో పాటు ధనమూ ఆదా అవుతుంది. ఒకవేళ విదేశాలకే వెళ్లాలనుకుంటే తక్కువ ఖర్చుతో వెళ్లి రాగలిగే మలేసియా, థాయ్‌ల్యాండ్ వంటివి ఎంచుకుంటే సరిపోతుంది.

లైఫ్@360




శరీరంలో స్రవించే హార్మోన్లలో ఒక్కోసారి చోటు చేసుకునే కొన్ని రకాల అసమతౌల్యతల కారణంగా చాలా ఒత్తిడికి లోనవుతుండటం లేదా మూడ్ ఆఫ్ కావడం మామూలే. అయితే దాన్ని సరిచేయడానికి మందులు మింగే బదులు కొన్ని ఆహారాలను తీసుకోవడం వల్ల మానసిక, శారీరక ఆరోగ్యాలు దృఢంగా ఉంటాయి. ఆ ఆహారాలేమిటో తెలుసుకుని, మూడ్ బాగుండనప్పుడు వాటిని తీసుకుంటే సరి!

మూడ్‌ని మార్చే ఫుడ్



ఒక్కొక్కసారి మనకు తెలియకుండానే మూడ్ పాడవుతుంది. ఏదో పోగొట్టుకున్నట్లు... వెలితిగా... ఒకలాంటి బాధగా అనిపిస్తుంది. అలాంటప్పుడు కొన్నిరకాల ఆహారాలను తీసుకోవడం వల్ల వెంటనే మూడ్ సరవుతుంది. అవేమిటో తెలుసుకుందాం...

పాలకూర.. ఐరన్ పాళ్లు అధికంగా ఉండే పాలకూర సంతోషకరమైన హార్మోన్లను పెంచడానికి పనిచేస్తుంది. అంతేకాదు, ఇందులో ఫైబర్, విటమిన్ ఇ పుష్కలంగా ఉండటం వల్ల జీర్ణవ్యవస్థకు, చర్మానికి ఎంతో మేలు చేస్తుంది. పాలకూర స్మూతీ, సూప్ లేదా పాలకూరను ఏదో ఒక రూపంలో ఆహారంలో తీసుకోవడం చాలా ఉపయోగకరంగా ఉంటుంది.



మష్రూమ్స్.. మష్రూమ్స్ యాంటి డిప్రెసెంట్ లక్షణాలకు ప్రసిద్ధి చెందింది. ఇందులో సమృద్ధిగా ఉండే విటమిన్ డి మానసిక స్థితిని నియంత్రిస్తుంది. ఇది సెరటోనిన్ సంశ్లేషణ స్థాయికి సంబంధించినది. దీని కారణంగా వ్యక్తి సంతోషకరమైన భావోద్వేగాలను అనుభవించగలడు. మీ మూడ్ ఆఫ్‌లో ఉన్నప్పుడు, మష్రూమ్ రెసిపీని తినడం వల్ల తిరిగి మంచి మూడ్‌లోకి వచ్చేసే అవకాశం మెండుగా ఉంది. ప్రయోజనకరంగా ఉంటుంది.

అవకాడో.. కొద్దికాలం క్రితం నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం అవకాడోలో పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఇందులో ఉండే విటమిన్ బీ3 ,ఒమేగా–3 ఫ్యాటీ యాసిడ్‌లు సంతోషకరమైన హార్మోన్ అయిన సెరోటోనిన్ ఉత్పత్తిని పెంచడంలో సహాయపడతాయి. రోజంతా సంతోషంగా ఉండటానికి సలాడ్, శాండ్‌విచ్ లేదా అల్పాహారంలో అవకాడోను చేర్చవచ్చు.



డ్రై ఫ్రూట్స్.. ప్రతిరోజూ కొన్ని బాదం లేదా వాల్‌నట్‌లను తినడం వల్ల మానసిక స్థితి మెరుగుపడుతుంది, ఒత్తిడి తగ్గుతుంది. డ్రై ఫ్రూట్స్‌లో ఉండే యాంటీ ఆక్సిడెంట్ల వల్ల ఇలా జరుగుతుంది.

డార్క్ చాకొలేట్.. ఓ నివేదిక ప్రకారం డార్క్ చాకొలేట్ తినడం వల్ల శరీరంలో సంతోషకరమైన హార్మోన్ల స్థాయి పెరుగుతుంది. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు మానసిక స్థితిని మెరుగుపరుస్తాయి. ఇందులో ఉండే ట్రిప్టోఫాన్ సెరోటోనిన్ స్థాయులను పెంచుతుంది. ఫలితంగా వెంటనే మూడ్ సరవుతుంది. మూడ్ బాగుండనప్పుడు ఈ ఫుడ్ ప్రయత్నించండి.



సినిమా

దేవర డేట్ ఫిక్స్



● ఎన్టీఆర్

రిలీజ్ డేట్ ఫిక్స్ చేసుకున్నాడు 'దేవర'. ఈ ఏడాది అక్టోబరు 10న 'దేవర' చిత్రం తొలి భాగం విడుదల కానుంది. 'జనతా గ్యారేజ్' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబోలో వస్తున్న చిత్రం ఇది. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సైఫ్ అలీఖాన్ ఓ లీడ్ రోల్‌లో నటిస్తున్నారు. నందమూరి కల్యాణ్ రామ్, కె. హరికృష్ణ, మిక్కిలినేని సుధాకర్ నిర్మిస్తున్న ఈ సినిమా రెండు భాగాలుగా విడుదల కానుంది. కాగా తొలి భాగాన్ని ఈ ఏడాది ఏప్రిల్ 5న విడుదల చేయాలనుకున్నారు. కానీ వాయిదా వేశారు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో అక్టోబరు 10న సినిమాని విడుదల చేయనున్నట్లు శుక్రవారం వెల్లడించారు మేకర్స్.

ఈ ప్రపంచాన్నే మనం బహిష్కరిద్దాం



● రాజేంద్రప్రసాద్, జయప్రద

'ఈ ప్రపంచం మన ప్రేమని తిరస్కరిస్తే.. ఈ ప్రపంచాన్నే మనం బహిష్కరిద్దాం' (రాజేంద్ర ప్రసాద్), 'అందరూ నన్ను ఏడిపించినవాళ్లే.. కానీ, నాకోసం ఏడ్చింది నువ్వు ఒక్కడివే' (జయప్రద) వంటి డైలాగులు 'లవ్ @65' మూవీ ట్రైలర్‌లో ఉన్నాయి. రాజేంద్ర ప్రసాద్, జయప్రద ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'లవ్ @65'. వీఎన్ ఆదిత్య దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో కార్తీక్ రాజు, స్పందన పల్లి ముఖ్య పాత్రలు పోషించగా, సునీల్, అజయ్ ప్రత్యేక పాత్రల్లో కనిపించనున్నారు. టీజీ విశ్వ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానున్న సందర్భంగా శుక్రవారం ట్రైలర్‌ని విడుదల చేశారు. 'రాత్రి ఇక్కడి నుంచి ఇద్దరు మిస్ అయిపోయారు సార్', 'ఎవరు', 'మా కావేరి సార్.. మా ఆది సార్', 'ఎలా మిస్సయ్యారు', 'వాళ్లు లేచిపోయారు సార్', 'ఇద్దరూ మేజర్లా', 'కాదు సార్.. ఆయనకి డెబ్బై నిండాయి.. ఆవిడకి ఓ అరవైఐదు దాక ఉంటాయి'.. వంటి డైలాగులు ట్రైలర్‌లో ఉన్నాయి. ఈ చిత్రానికి కెమెరా: శ్యామ్ తుమ్మలపల్లి, సంగీతం: అనూప్ రూబెన్స్.

అన్యాయంపై పోరాటం



● అనుష్క

'అరుంధతి', 'భాగమతి'.. ఇలా ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్స్‌లో తనదైన శైలిని చాటుకుని సక్సెస్ అయ్యారు అనుష్క. తాజాగా ఆమె కథానాయిక ప్రాధాన్యంగా సాగే మరో సినిమా అంగీకరించారు. క్రిష్ (జాగర్లమూడి రాధాకృష్ణ) ఈ సినిమాకు దర్శకుడు. యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ మొదలైంది. ఒడిశాలోని ఒక మహిళ జీవితంలో పదేళ్ల క్రితం జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా ఈ సినిమా రూపొందుతోందని సమాచారం. తనకు జరిగిన అన్యాయంపై పోరాటం చేసే ఓ సాధారణ అమ్మాయిగా అనుష్క పాత్ర ఉంటుందట. ఇటీవల ఒడిస్సాలో కీలక సన్నివేశాల చిత్రీకరణ జరుపుతున్నారని తెలిసింది. కాగా ఈ సినిమాకు 'శీలవతి' అనే టైటిల్‌ను చిత్ర యూనిట్ పరిశీలిస్తోందనే టాక్ వినిపిస్తోంది. అలాగే ఈ సినిమాలో తమిళ నటుడు విక్రమ్ ప్రభు ఓ లీడ్ రోల్ చేస్తున్నారని, ఈ సినిమా ఈ ఏడాదే దక్షిణాది భాషల్లో విడుదలవుతుందనే ప్రచారం జరుగుతోంది. ఈ విషయాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

మహారాజా?



● మహేశ్‌బాబు

మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో అంతర్జాతీయ స్థాయిలో ఓ భారీ బడ్జెట్ ఫిల్మ్ తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలోని హీరోయిన్ పాత్ర కోసం ఇండోనేషియా బ్యూటీ చెల్సియా ఇస్లాన్, దీపికా పదుకోన్ పేర్లు తెరపైకి వచ్చాయి. ఫారెస్ట్ అడ్వెంచరస్ ఫిల్మ్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రానికి 'మహారాజా', 'మహారాజ్', 'చక్రవర్తి' అనే టైటిల్స్‌ను పరిశీలిస్తున్నారనే టాక్ తెరపైకి వచ్చింది. మరి.. ఫైనల్‌గా ఈ టైటిల్స్‌లో ఏదో ఒకటి ఫిక్స్ అవుతుందా? లేక మరొక టైటిల్‌ను మేకర్స్ ఖరారు చేస్తారా? అనేది తెలియాలంటే కొన్ని రోజులు వెయిట్ చేయక తప్పదు. ఇక విజయేంద్రప్రసాద్ కథ అందించిన ఈ చిత్రానికి ఎమ్ఎమ్ కీరవాణి సంగీతదర్శకుడు. ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ఈ ఏడాది వేసవిలో ఆరంభమవుతుందని టాక్.


మళ్లీ వస్తున్నాడు జోకర్



● 'జోకర్ 2' పోస్టర్

హాలీవుడ్ జోకర్ మళ్లీ వస్తున్నాడు. హాలీవుడ్ మ్యూజికల్ సైకలాజికల్ థ్రిల్లర్ ఫిల్మ్ 'జోకర్'. జోక్విన్ ఫీనిక్స్ ప్రధాన పాత్రలో టాడ్ ఫిలిప్స్ డైరెక్షన్‌లో రూపొందిన ఈ సినిమా 2019లో విడుదలై బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ఈ సినిమాకు సీక్వెల్‌గా 'జోకర్ 2' (జోకర్: ఫోలీ ఎ డ్యూక్స్)ను ప్రకటించారు టాడ్ ఫిలిప్స్. ఈ చిత్రంలో జోక్విన్ ఫీనిక్స్‌తో పాటు లేడీ గగా మరో లీడ్ రోల్ చేస్తున్నారు. జాజై బీట్జ్ మరో లీడ్ రోల్‌లో కనిపిస్తారు. లాస్ ఏంజిల్స్, న్యూయార్క్, న్యూ జెర్సీ లొకేషన్స్‌లో చిత్రీకరణ జరిపారు. ఈ చిత్రం ట్రైలర్ ఏప్రిల్ 4న విడుదల కానుం దని హాలీవుడ్ టాక్. సినిమాను ఈ ఏడాది అక్టోబరు 4న విడుదల చేయాలనుకుంటున్నారు. టాడ్ ఫిలిప్స్, బ్రాడ్లీ కూపర్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా వార్నర్ బ్రదర్స్ డిస్ట్రిబ్యూట్ చేయనుంది.

థ్రిల్ స్టార్ట్



● మోహన్ భగత్

మోహన్ భగత్, సుప్రిత సత్యనారాయణ్, భూషణ్ కల్యాణ్, రవీంద్ర విజయ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ఆరంభం'. అజయ్ నాగ్ వి. దర్శకత్వంలో వీటీ అభిషేక్ నిర్మిస్తున్న సినిమా ఇది. ఈ సినిమా టీజర్‌ను హీరో నాగచైతన్య విడుదల చేసి, 'బ్యాగ్రౌండ్‌లో రామాయణ స్టోరీని నరేట్ చేస్తూ ఇంటర్‌కట్స్‌లో వేసిన విజువల్స్‌తో టీజర్‌ని డిఫరెంట్‌గా కట్ చేశారు. థ్రిల్లింగ్, యాక్షన్ ఎలిమెంట్స్‌తో టీజర్ ఆసక్తిగా ఉంది'' అన్నారు.

యుద్ధానికి సిద్ధం!



● హృతిక్ రోషన్

బాలీవుడ్‌లో మరో వార్‌కు సిద్ధం అవుతున్నారు హీరో హృతిక్ రోషన్. ఆయన నటిస్తున్న యాక్షన్ స్పై ఫిల్మ్ 'వార్ 2'. ఎన్టీఆర్ మరో లీడ్ రోల్ చేస్తున్నారు. అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ ఈ నెలాఖర్లో ప్రారంభం కానుంది. హృతిక్ రోషన్‌పై ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను ప్లాన్ చేశారట అయాన్ ముఖర్జీ. ఈ చిత్రం 2025 ఆగస్టు 14న విడుదల కానుంది. 2019లో హృతిక్, టైగర్ ష్రాఫ్‌లు నటించిన 'వార్' సినిమాకు సీక్వెల్‌గా 'వార్ 2' వస్తోంది.

రీల్స్

పెళ్లనేది పాన్ ఇండియా సమస్య



● 'అల్లరి' నరేశ్

'ఆ ఒక్కటీ అడక్కు' అంటున్నారు హీరో 'అల్లరి' నరేశ్. ఆయన నటిస్తున్న 61వ చిత్రానికి నూతన దర్శకుడు మల్లి అంకం దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో ఫరియా అబ్దుల్లా హీరోయిన్. రాజీవ్ చిలక నిర్మిస్తున్న ఈ సినిమాకి 'ఆ ఒక్కటీ అడక్కు' టైటిల్ ఖరారు చేసి, ఫస్ట్ లుక్ గ్లింప్స్ విడుదల చేశారు. ఈ మూవీలో నరేశ్ పాత్ర పేరు గణ. అతని పెళ్లి గురించి కుటుంబ సభ్యులు, ఇరుగు పొరుగు వారు అడిగితే.. 'ఆ ఒక్కటీ అడక్కు.. పెళ్లనేది పాన్ ఇండియా సమస్య' అంటూ నరేశ్ చెప్పే డైలాగ్స్ గ్లింప్స్‌లో ఉన్నాయి. ''వినోదాత్మకంగా రూపొందుతున్న చిత్రమిది. మార్చి 22న విడుదల చేస్తాం'' అన్నారు మేకర్స్.

గ్రామీణ నేపథ్యంలో...



● యువ చంద్రకృష్ణ

యువ చంద్రకృష్ణ, అనన్య నాగళ్ల జంటగా సాహిత్ మోత్కూరి దర్శకత్వం వహించిన చిత్రం 'పొట్టేల్'. నిశాంక్ రెడ్డి కుడితి, సురేష్ కుమార్ సడిగె నిర్మించిన ఈ చిత్రానికి శేఖర్ చంద్ర సంగీతం అందించారు. ఈ చిత్రం నుంచి 'వవ్వారే..' అంటూ సాగే రెండో పాటని విడుదల చేశారు. కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించిన ఈ పాటని రాహుల్ సిప్లిగంజ్ పాడారు. ''గ్రామీణ నేపథ్యంలో కొత్త కథాంశంతో తెరకెక్కిన చిత్రం 'పొట్టేల్'. ఈ చిత్రంలోని భావోద్వేగాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

సందె వేళ...



● శాంతి చంద్ర, దీపికా సింగ్

శాంతి చంద్ర హీరోగా, దీపికా సింగ్, మిస్ ఇండియా 2022 సిమ్రితి హీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'డర్టీ ఫెలో'. ఆడారి మూర్తి సాయి దర్శకత్వంలో గూడూరు భద్రకాళి సమర్పణలో జీయస్ బాబు నిర్మించిన ఈ సినిమా త్వరలో రిలీజ్ కానుంది. డా. సతీష్ కుమార్ పి. సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'సందె వేళ...' అంటూ సాగే పాటని డైరెక్టర్ సాయి రాజేశ్ రిలీజ్ చేసి, మాట్లాడుతూ– ''నా మిత్రుడు శాంతి చంద్ర నటించిన 'డర్టీ ఫెలో'లోని 'సందె వేళ..' పాట బాగుంది'' అన్నారు. ''వినూత్న కథతో రూపొందిన చిత్రమిది'' అన్నారు శాంతిచంద్ర.

ప్రేమ.. నవ్వులు



● గౌతమ్, పరశురామ్

గౌతమ్ సాగి, దీప్తికా జంటగా చంద్ర శేఖర్ కానూరి దర్శకత్వంలో శ్రీధర్ వర్మ సాగి నిర్మిస్తున్న చిత్రం 'రవికుల రఘు రామ'. సుకుమార్ పమ్మి సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'చందమామే..' అంటూ సాగే పాటని డైరెక్టర్ పరశురామ్ విడుదల చేశారు. ''లవ్ అండ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రమిది. ప్రేక్షకులకు మంచి వినోదాన్ని ఇవ్వాలని తన సృజనాత్మకత మొత్తం జోడించి ప్రాణం పోస్తున్నారు చంద్రశేఖర్'' అని యూనిట్ పేర్కొంది.